క్లుప్తంగా

అప్పన్నకు స్వర్ణపుష్పార్చన



అప్పన్న ఉత్సవమూర్తుల చెంతన స్వర్ణపుష్పాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు.

పీవీజీ రాజుకు ఘన నివాళి



పీవీజీ రాజు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త దివంగత పీవీజీ రాజు 29వ వర్ధంతిని దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో గురువారం నిర్వహించారు. అక్కడున్న ఆయన విగ్రహానికి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. దేవస్థానం అభివృద్ధికి పీవీజీ రాజు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, డీఈ హరి, ఏఈవోలు వీబీవీ రమణమూర్తి, లీగల్ అడ్వైజర్ ప్రసాద్‌వర్మ, సూపరింటెండెంట్‌లు సునీల్, సత్యవాణి, పీఆర్వో నాయుడు, దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–1 సబ్‌స్టేషన్, సెక్షన్–2 అంతకాపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో ప్రీ మాన్సూన్ ఇన్‌స్పెక్షన్ వర్క్‌లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఆయా సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాల్లో ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు అందిస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత, శంకర్రావు

పెందుర్తి: ఇటీవల విజయవాడలో వరదల సమయంలో అక్కడ సేవలందించేందుకు వెళ్లిన జీవీఎంసీ 97వ వార్డు పారిశుధ్య కార్మికులను గురువారం ఘనంగా సత్కరించారు. చినముషిడివాడలోని జీవీఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కార్పొరేటర్ శానా పతి వసంత, నాయకుడు శంకర్రావు చేతుల మీదుగా సత్కరించి దుస్తులు పంపిణీ చేశారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి: పెందుర్తి సమీపంలోని దొగ్గవానిపాలెం కాలనీకి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ జి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసం ఉంటున్న మనసా మంగరాజు గత నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో మంగరాజు భార్య వరలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

ఇక పక్కా.. మూగజీవాల లెక్క

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుసంపద అత్యంత కీలకం. వ్యవసాయం యాంత్రీకరణ బాట పట్టినా.. గ్రామాల్లో ఇప్పటికీ పశుపోషణ చాలా మందికి ప్రధాన జీవనాధారం. కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లకోసారి పశువుల గణన చేపడుతోంది. ప్రస్తుతం 21వ అఖిల భారత జాతీయ పశుగణన ప్రారంభించింది. మండలంలో గత నెల 25న ప్రారంభమైన ఈ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగనుంది.

- మండలంలో చురుగ్గా పశుగణన
- నాలుగు నెలలపాటు సాగనున్న ప్రక్రియ
- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్లు



గుల్లేపల్లిలో వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్లు, పర్యవేక్షిస్తున్న అంతకాపల్లి వెటర్నరీ డాక్టర్ సంధ్య

సబ్బవరం: మండలంలోని 24 పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లో జాతీయ పశుగణన ప్రక్రియ మొదలైంది. రెవెన్యూ పరిధి యూనిట్‌గా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు తదితర పశువులతోపాటు కోళ్ల లెక్కింపు ప్రక్రియను గత నెల 25న ప్రారంభించారు. ఈ ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగనుంది. సుమారు నాలుగు మాసాలపాటు జరిగే ఈ పశుగణనకు ప్రాంతీయ పశువైద్యశాల ఆధ్వర్యంలో వెటర్నరీ సహాయకులు, గోపాలమిత్రలు, ఇతర సిబ్బందిని ఎన్యూమరేటర్లుగా నియమించారు. వీరు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి సమగ్ర సమచారం సేకరించి, వారికి ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ ఫామ్‌లో నమోదు చేస్తారు. ఈ ఎన్యూమరేటర్లను ఆ పరిధిలోని వెటర్నరీ వైద్యులు పర్యవేక్షిస్తున్నారు.

సేకరిస్తున్న వివరాలు

పశుగణనలో భాగంగా 16 కేటగిరీల్లో వివరాలను ఎన్యూమరేటర్లు సేకరిస్తున్నారు. తెల్లజాతి, నల్లజాతి పశువులతోపాటు గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, కోళ్లు తదితర పెంపుడు జీవాల వివరాలన్నీ నమోదు చేస్తున్నారు. పశువుల వివరాలతోపాటు సంబంధిత రైతు పేరు, చిరునామా, ఫోన్ నంబర్, జీవాల వయసును సేకరిస్తున్నారు. వీటిని తమకు అందించిన ట్యాబ్‌లో డిజిటల్ ఫార్మాట్‌లో నిక్షిప్తం చేస్తారు. ఈ వివరాలన్నీ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన భారత్ పశుదాన్ పోర్టల్‌కు చేరతాయి. చివరిసారిగా 2019లో మండలంలో పశుగణన నిర్వహించారు. మండలంలోని 33 రెవెన్యూ గ్రామాల పరిధిలో 21,410 గృహాల వివరాలను సేకరించారు. ఇపుడు వీటితోపాటు, మిగిలిన గృహాల్లో కొత్తగా చేరిన జీవాల వివరాలను కూడా సేకరించనున్నారు.

ప్రయోజనాలు

మండలంలో వ్యవసాయం తర్వాత పశుపోషణ ప్రధాన జీవనోపాధిగా ఉంది. పాడి పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు తదితర జీవాల పెంపకం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల సంఖ్యలో ఉపాధి పొందుతున్నారు ఈ గణన ద్వారా జాతీయ సంపదను అంచనా వేసి, పశువుల అభివృద్ధికి కార్యాచరణ రూపకల్పన, పశు ఆరోగ్యం, పాడి పరిశ్రమకు అవసరమైన మౌలిక వసతుల గుర్తింపు, పథకాల అమలుకు దోహదపడనుంది.

మండలంలోని పశు సంపద (2019-20)

ఆవులు	బర్రెలు	గొర్రెలు	మేకలు	పందులు	కుక్కలు	కుందేళ్లు	బాతులు	పౌల్ట్రీ కోళ్లు	ఇతర పౌల్ట్రీ జీవాలు
10,778	7,919	2,472	4,449	29	190	2	10	11,86,791	66



సబ్బవరంలోని ప్రాంతీయ పశువైద్యశాల

చురుగ్గా పశుగణన



మండలంలో పశుగణన చురుగ్గా సాగుతోంది. 11 మంది ఎన్యూమరేటర్లు ఈ పశుగణన కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. ఈ బృందానికి అంతకాపల్లి, గుల్లేపల్లి, ఆరిపాక పశు వైద్య కేంద్రాల వైద్యులు సంధ్య, అరుణ, స్వర్ణలత సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు 1733 గృహాల వివరాలు సేకరించాం. సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు యాప్ సాయంతో ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం.

– డాక్టర్ కె.ఉషాకుమారి, ఏడీ, ప్రాంతీయ పశు వైద్యశాల, సబ్బవరం

వీఎంఆర్‌డీఏ స్థలం వేలాన్ని ఆపాలి

- ప్రజావసరాల నిర్మాణాలను చేపట్టాలి
- మెట్రోపాలిటన్ కమిషనర్‌కు చినముషిడివాడ వుడా రెసిడెంట్స్ సంఘం వినతి



మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందిస్తున్న చినముషిడివాడ వుడా రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పెందుర్తి: ప్రజావసరాలకు సంబంధించిన నిర్మాణాలకు ఉపయోగిస్తామని చెప్పిన స్థలాన్ని వేలం ద్వారా విక్రయించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని చినముషిడివాడ వుడా రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. చినముషిడివాడ వుడా లేఅవుట్ 2005లో ఏర్పడిందని, ఇక్కడ వుడా కమర్షియల్ కాంప్లెక్స్, బ్యాంక్, పోస్టాఫీస్, మార్కెట్ ఇతర సామాజిక అవసరాల నిమిత్తం 1,240 చదరపు గజాలు కేటాయించినట్లు కమిషనర్‌కు వివరించారు. ఆ వివరాలు ప్లాన్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. కానీ ఆ స్థలాన్ని ఈ నెల 18న వేలం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తుండడం సమంజసం కాదన్నారు. మెయిన్ రోడ్డు నుంచి సుమారు 3 కిలోమీటర్ల లోపలకు ఈ లేఅవుట్ ఉండడంతో నిత్యావసరాలకు దూరం వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో లేఅవుట్‌లో సామాజిక అవసరాల కోసం కేటాయించిన ఈ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్, బ్యాంక్, పోస్టాఫీస్ నిర్మించాలని కోరారు. వెంటనే ఈ స్థలానికి సంబంధించిన వేలం ప్రక్రియను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

కూటమి పాలనలో పేదల బతుకులు కుదేలు

- నిత్యావసర సరకులు, విద్యుత్ ధరల పెరుగుదలపై సీపీఎం నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం ప్రతినిధులు, ప్రజలు

పెందుర్తి: టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పేదల బతుకులు కుదేలవుతున్నాయని సీపీఎం గోపాలపట్నం డివిజన్ కార్యదర్శి బి.జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు నిత్యావసర సరకుల ధరలు, మరోవైపు విద్యుత్ చార్జీలు ఇష్టానుసారంగా పెంచుతూ ప్రజలకు తీవ్ర ఆర్థిక భారం కలిగిస్తున్నారన్నారు. నిత్యావసరాల ధరలు, విద్యుత్ చార్జీల పెరుగుదల, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర సరకుల ధరలతో కూలీలు, పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు పూట గడవని పరిస్థితికి దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్థం లేని కారణాలు చెబుతూ విద్యుత్ చార్జీలను ఇష్టానుసారం పెంచుతున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి ఇప్పుడు బడ్జెట్‌లో కనీసం ఆ ప్రస్తావన కూడా లేకుండా చేశారని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేకుండా..నిరుద్యోగ యువతకు ఉపాధి లేకుండా చేశారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రజలపై బాదుడు ఆపాలని.. లేకపోతే ప్రభుత్వంపై ప్రజలు ప్రత్యక్ష దాడికి దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోలాటం కర్రలతో నినాదాలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కిరణ్‌కు వినతిపత్రం అందించారు. సీపీఎం జోన్ కమిటీ సభ్యులు బి.రమణి, జక్కన్న, సత్యనారాయణ, వెంకటలక్ష్మి, తిరుపతిరావు, నాయకులు అప్పలనాయుడు, అనంతలక్ష్మి, ప్రభుదేవా, మౌలాలి, మహేష్, అన్నపూర్ణ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలల నేస్తం.. చాచా నెహ్రూ



రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న జీఎం రమ్య

పెందుర్తి: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జీఎం కె.రమ్య మాట్లాడుతూ విద్యార్థులంతా భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాలల నేస్తం చాచా నెహ్రూ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఆడిపాడి సందడి చేశారు. ఇటీవల నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోనల్ ప్రిన్సిపాల్ స్వరూప, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి



పాఠశాల క్రీడా మైదానం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

పెందుర్తి: మండలంలోని సరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని క్రీడా మైదానాన్ని గ్రామంలోని యువత అభివృద్ధి చేశారు. గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్, సీనియర్ డైరెక్టర్ రవికిషోర్ భగవతుల, రెడ్డి భావన ఆర్థిక సహాయంతో మైదానంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రో బాల్, క్రికెట్ ప్రాంగణాలను అందుబాటులోకి తెచ్చారు. ఆయా క్రీడా మైదానాన్ని పాఠశాలకు గురువారం అంకితం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్లె రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి రమణ, నాయకుడు జీసీబీ ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సహకార సంఘ వారోత్సవాల ప్రారంభం



సహకార సంఘ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డివిజన్ సహకార అధికారి కిరణ్‌కుమారి

సబ్బవరం: సహకార రంగం స్ఫూర్తికి అనుగుణంగా పనిచేసి, ప్రజలకు సేవలను అందించాలని అనకాపల్లి, యలమంచిలి డివిజన్ల సహకార అధికారి కిరణ్‌కుమారి సిబ్బందికి తెలిపారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గురువారం నిర్వహించిన అఖిల భారత సహకార వారోత్సవాలను ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సహకార సంఘాల వివరాలను కంప్యూటరీకరించడం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సబ్బవరం దుర్గమాంబ సహకార సంఘ పర్సన్ ఇన్‌చార్జ్ పీవీఎస్ శాస్త్రి, సంఘం సీఈవో జి.రమణ, జి.సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



పెందుర్తి: గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న నాయకులు, స్థానిక పెద్దలు, విద్యార్థులు



అడవివరం: నెహ్రూ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కార్పొరేటర్ నరసింహం



సబ్బవరం మేజర్ పంచాయతీలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు తదితరులు

పెందుర్తి: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. గ్రంథాలయం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ మాట్లాడుతూ శుక్రవారం 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 'గ్రంథాలయాలు–ఉపయోగాలు', 6–10 విద్యార్థులకు 'విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగం రోజుకో అంశంపై పోటీలు, ప్రత్యేక కార్యక్రమాలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఆఖరి రోజైన బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ముందుగా సరస్వతిదేవి విగ్రహానికి పూజలు చేశారు. జాతీయ జెండా ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైఎస్సార్‌సీపీ నేత, డీఆర్‌సీ మాల్ అధినేత దాడి రమణ చిట్టి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ వేగి దివాకర్, విశ్రాంత ఉపాధ్యాయుడు జానకిరామ్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పెతకంశెట్టి భూలోక, కార్యదర్శి ఆడారి రామకృష్ణ, కోశాధికారి పెంటకోట గణేష్, స్థానిక పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరం గ్రంథాలయలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, గ్రంథాలయ స్థల దాత దాసరి సన్యాసిశెట్టి, కార్మిక నాయకులు సీహెచ్ సూర్యనారాయణరాజు, న్యాయవాది కె.రామకృష్ణ, గ్రంథాలయ ఉద్యోగి ఎల్లమ్మ, పలు పాఠశాలలకి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలను జాతీయ జెండా ఆవిష్కరించి, ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి వి.శిరీష వారోత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, ప్రసాద్, భాను, ఉపాధ్యాయులు నాగేశ్వరి, సింహాద్రి, స్థానిక నాయుకుడు యర్రంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల భాగస్వామ్యంతోనే పంచాయతీల అభివృద్ధి



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

సబ్బవరం: ప్రజల భాగస్వామ్యంతోనే పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై ప్రజాప్రతినిధులకు గురువారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంచాయతీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంస్కరణలను విధిగా పాటించాలన్నారు. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల్లో గ్రామస్తులను భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎంపీడీవో పద్మజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకంపై ప్రచారం



కార్యక్రమంలో పాల్గొన్న ముమ్మన దేముడు

పెందుర్తి: అసంఘిటిత కార్మికులకు కేంద్ర ప్రభుత్వ పథకం ఆయుష్మాన్ భారత్ భరోసాగా నిలుస్తుందని కార్పొరేటర్, బీజేపీ నాయకుడు ముమ్మన దేముడు అన్నారు. గురువారం 95వ వార్డు శివగాయిత్రి నగర్‌లో పథకంపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేముడు మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. పథకంపై సందేహాలను నివృత్తి చేశారు. లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారి బి.వెంకటరావు, బీజేపీ నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె



మండల పరిషత్ ఏవో ప్రసాదరావుకు సమ్మె నోటీస్ అందజేస్తున్న 108 సిబ్బంది.

సబ్బవరం : సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని 108 సిబ్బంది స్పష్టం చేశారు. ఈ మేరకు మండల పరిషత్ ఏవో శివప్రసాదరావుకు, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ అప్పారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 108 సేవలను, సిబ్బందిని ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, వేతన శ్లాబ్‌లను అప్‌డేట్ చేసి వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 25వ తేదీ నుంచి ప్రత్యక్ష సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో జి.సంజీవరావు, కె.సతీష్ కుమార్, ఎ.శ్రీనివాసరావు, ఎస్.ఇంద్ర రమణ, కె.సూరిబాబు ఉన్నారు.

'పీఎం సూర్యఘర్'తో రాయితీపై సోలార్ పరికరాలు

సబ్బవరం: ఇంటి పైకప్పులపై రాయితీ ధరలతో సోలార్ రూఫ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను ఆదాచేసుకోవచ్చని ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. మండలంలోని గుల్లేపల్లిలో ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై గురువారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొని, పథకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సోలార్ రూఫ్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీలను, ఉపయోగాలను, రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని ఈపీడీసీఎల్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, ఈపీడీసీఎల్ ఏడీఈ నిరీక్షణ్ అంబేడ్కర్, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, బండారు శ్రీను, గజ్జి దేముడుబాబు, గజ్జి నరసింగరావు, ఏఈలు వీరేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌లో తరలిస్తున్న గంజాయి పట్టివేత



ఆర్టీసీ బస్‌లో పోలీసులు పట్టుకున్న గంజాయి

పెందుర్తి: అరకు నుంచి విశాఖ నగరానికి ఆర్టీసీ బస్‌లో తరలిస్తున్న గంజాయిని పెందుర్తి చెక్ పోస్టు వద్ద పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఓ మహిళ బ్యాగ్‌లో ఉన్న రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోనికి తీసుకున్నారు. వివరాలివి..అరకువ్యాలీలో నివాసం ఉంటున్న కేడా సంధ్య తన బ్యాగ్‌లో గంజాయిని నగరానికి తరలిస్తుంది. పెందుర్తి వద్దకు బస్ వచ్చేసరికి సాధారణ తనిఖీలు చేస్తుండగా గంజాయి పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న సంధ్యను అదుపులో తీసుకున్నారు. సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ రెడ్డి అసిరితాత దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బెల్ట్ దుకాణంపై దాడి



గవర జగ్గయ్యపాలెంలో బెల్ట్ దుకాణంలో పట్టుబడిన మద్యం

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గవరజగ్గయ్యపాలెంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ దుకాణంపై పోలీసులు గురువారం దాడి చేశారు. నిర్వాహకుడు కనుగుల చండికేశ్వరరావును అదుపులోనికి తీసుకుని అమ్మకానికి సిద్ధంగా ఉన్న 140 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఏపీ ఎక్సైజ్ యాక్ట్ ద్వారా కేసు నమోదు చేసినట్లు సీఐ కె.వి. సతీష్‌కుమార్ వెల్లడించారు.

విద్యుత్ వైర్లకు తగిలి గడ్డి వ్యాన్ దగ్ధం



వ్యాన్‌లోని గడ్డిని తొలగిస్తున్న పొక్లెయిన్

సబ్బవరం: మండలంలోని ఆరిపాక సమీపంలో వరి గడ్డి తరలిస్తున్న టాటా ఏస్ వ్యాన్ గురువారం అగ్నిప్రమాదానికి గురై దగ్ధమయింది. స్థానికులు భయాందోళనతో పరుగు తీశారు. చోడవరం నుంచి సబ్బవరం వైపు గడ్డిని తరలిస్తున్న ఈ వ్యాన్‌కు మంటలు అంటుకోవడంతో భయపడిన డ్రైవర్ వాహనాన్ని చినయాతపాలెం పెట్రోల్ బంకులోకి మళ్లించారు. బంక్ సిబ్బందితోపాటు, వినియోగదారులు కేకలు వేయడంతో రోడ్డుపక్కనే ఉన్న ఓ ఇంటి వద్దకు మళ్లించాడు. విద్యుత్ తీగల కింద నిలిపేశారని కేకలు వేయడంతో మళ్లీ రోడ్డువేపు తిప్పాడు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. చుట్టుపక్కల ఉన్నవారు మంటల్ని ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇంతలో అటుగా వచ్చిన పొక్లెయిన్ డ్రైవర్ చాకచక్యంగా కాలుతున్న వ్యాన్‌ను రోడ్డు పక్కకు తిరగేసి, గడ్డిని తొలిగించి మంటల నుంచి వ్యాన్‌ను బయటకు తీశాడు. ఇంతలో ఫైర్ ఇంజన్ వచ్చి, మంటల్ని అదుపు చేసింది. విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు చెప్పారు.